


తెల్లవారు జామున నాలుగంటలకు లేచి, కుళాయి నీళ్ళు పట్టుకొని వంట చేసి కేరీజీలు సిద్ధం చేసి, ఎనిమిది కాకముందే పిల్లలిద్దర్నీ తయారుచేసి రిక్షాలో స్కూలికి పంపి, రమాకాంత్ బయటకు వెళ్లే వరకు అతని పనుల్లో సాయపడి, గబగబా గొట్లో నాలుగు మెతుకులు వేసుకొని, ఇంటికి తాళం వేసి, సరిత హడావుడి ఆఫీసుకి బయలుదేరుతున్న సమయానికి పనిపిల్ల కనకం వచ్చింది.

"ఇంత ఆలస్యంగా వస్తే ఎలా కనకం?... నాకు టైం అవుతుందని నీకు తెలీదా?" తాళం చెవి పనిపిల్ల చేతికిస్తూ విసిరింది, సరిత.

"ఇయ్యాల గుడికెళ్లానమ్మ గోరూ! రేవట్నుంచి బేగా ఒస్తానండీ" కనకం తలవొంచుకుని సమాధానం యిచ్చింది.

"నీ కూడా యింత వరకు వచ్చిన ఆ అబ్బాయి ఎవరు?"

అమ్మగారు ఆ ప్రశ్న అడుగుతారని ముందుగా కనకం ఊహించలేదు. మొదట కంగారు పడింది. తర్వాత నసిగింది. మొత్తానికి ఏమీ చెప్పలేదు.

"సరి... సరి... ఇంట్లో పనులు చూసుకో. వస్తాను" అంటూ సరిత బస్సుస్టాపు వేపు పరుగు తీసింది.

"హమ్మయ్యా' అనుకొని, కనకం తలుపులు తీసి, వంట గదిలోకి వెళ్ళింది.

సరిగ్గా పదీ యిరవై నిమిషాలయింది. ఎప్పటిలాగే నెత్తిమీద అక్షంతలు మాత్రమే వేస్తాడనుకున్న మేనేజరు గట్టిగా కేకలు వేసే సరికి సరితకు కళ్ళలో నీళ్లు తిరిగాయి.

'ఎలాంటి అవసరం లేని తను ఎందుకు ఉద్యోగం చేస్తున్నట్లు?' ఇలాంటి సమయాల్లో ఆ ప్రశ్న తనకి ఎదురవుతుంది.

రమాకాంత్ బ్యాంక్‌లో పెద్ద ఉద్యోగి. అయిదు వేల వరకు జీతం వస్తుంది. ఇద్దరే పిల్లలు. సొంత ఇంట్లో ఉంటున్న వాళ్లకెలాంటి బరువులూ బాధ్యతలూ లేవు.

ఒక రోజు – 'నాకూ ఉద్యోగం చెయ్యాలని ఉందని' తన మనసులో మాట వ్యక్తం చేసింది, సరిత.

అవసరం ఉన్నప్పుడు, ఆర్థికంగా యిబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు తప్పకుండా ఆడవాళ్లు ఉద్యోగాలు చెయ్యాలి. మగాళ్లకి సాయపడాలి. ఇల్లు గడవటానికి వాళ్ళ బాధ్యతలు పంచుకోవాలి. అటువంటి యిబ్బందులూ యిక్కట్లూ లేనప్పుడు సరిత ఉద్యోగం చెయ్యాలని ఎందుకనుకుంటుందో రమాకాంత్‌కి అర్థం కాలేదు.

ఆ మాటే చెప్పి, ఏదో సలహా యివ్వబోయాడు.

"బాబూ! ఆడదాన్నని, వంటింట్లో చీకట్లో కట్టి పడెయ్యాలని ఆలోచించకండి" ఆమె నిష్ఠూరంగా మాట్లాడింది.

"ఓకే.... ఓకే సరితా!... నీ యిష్టప్రకారమే చెయ్" అతను గలగలా నవ్వేస్తూ అన్నాడు.

ఉద్యోగంలో చేరిన మొదటి రోజుల్లో సరదాగా ఉండేది. రాను రాను యాంత్రికంగా మారిపోవడం చేత ఆమె మనసులో అవ్యక్తమైన ఆందోళన, అసంతృప్తి, అసహనం చోటు చేసుకుంటున్నాయి.

ఈ మధ్య ఇంట్లో పని చేసుకోవడం చాలా కష్టంగా ఉంది. ఆమె క్షణం తీరిక చేసుకోవాలనుకున్నప్పటికీ పని తరగడం లేదు. పిల్లల గురించి బొత్తిగా పట్టించుకోవడం లేదు. వాళ్ళ హోం వర్కుగాని ఆలనా పాలనా గాని చూళ్ళేక పోతుంది. అథవా ఎప్పుడైనా పిల్లలకు చదువు చెప్పవలసి వస్తే, ఊరికే కోపం తెచ్చుకోవడం, వాళ్లను కొట్టడం జరుగుతుంది.

ఒకసారి బస్సు దొరికి ఇల్లు చేరేసరికి ఏడు గంటలయింది. అప్పటికి రమాకాంత్ కూడా రాలేదు.

పిల్లల గదిలోకి అడుగుపెడుతున్న సరిత, లోపల సంభాషణ విని, ఒక్క క్షణం ఆగిపోయింది.

"ఒరేయ్ బాబీ! ఇప్పుడే నేనొచ్చానని అమ్మతో చెప్పకేం? నీకు చాక్లెటిస్తాను" పాప బతిమాలుతుంది, తమ్ముణ్ని మచ్చిక చేసుకుంటూ.

"ఇంత సేపూ ఏం చేశావ్?" బాబీ ప్రశ్నించాడు కళ్లు గుండ్రంగా తిప్పుతూ.

"బిగ్ గర్ల్స్‌తో సినిమా కెళ్లాను"

"అయితే, నాకు అయిదు చాక్లెట్లు యిస్తే అమ్మతో చెప్పను"

"రేపిస్తాను... మరి, చెప్పవు కదూ?"

"చెప్పను... ప్రామీస్..."

ఆమెలో ఉక్రోషం తన్నుకొచ్చింది. పదేళ్ళు నిండని పాప మోసం చెయ్యడమా? పైగా యిప్పట్నుంచీ సినిమాలు పిచ్చర్ల కోసం స్కూలు ఎగ్గొట్టడమా? కోపం పట్టలేక, పాపను గట్టిగా కొట్టింది.

"కనకం! రేపట్నుంచి ఎవరు, ఎన్ని గంటలకు స్కూలు నించి వస్తున్నారో నువ్వు నాతో చెప్పాలి" పని పిల్లకు కొత్త పని అప్పగించింది.

పని పిల్లను పెట్టుకున్నా, పిల్లల్ని సరిగ్గా చూసుకోలేకపోతుంది. ఒక్కోసారి పిల్లల పట్ల కఠినంగా వ్యవహరించినా, అంతలోనే బాధపడుతుంది. పనిపిల్లను ఎక్కువగా శ్రమపెడుతున్నందుకు నొచ్చుకుంటుంది కూడా.

ఇప్పుడనిపిస్తుంది – రెండు పడవల మీద కాళ్లు పెట్టి ప్రయాణం చేయడం కష్టం అని. తన ఉద్యోగానికి వెంటనే రాజీనామా యివ్వాలనుకుంటుంది. కానీ, చాతగాక తప్పుకుంటే ఓటమి అవుతుందని ఆ ప్రయత్నం మానుకుంటుంది.

ఈ ఊగిసలాటలో ఆమె నలిగిపోతుంది కూడా.

గోడ మీది గడియారంలో గంట విని, సరిత ఆలోచనల నుంచి బయట పడింది.

గుబగుబా ఫైలు తీసి, కాగితాలు చూసింది.

* * *

ఆ రోజు విపరీతంగా తలనొప్పిగా ఉండటం చేత సరిత ఆఫీసుకి హాఫ్‌డే సెలవు పెట్టింది. రమాకాంత్‌కి ఫోను చేసి, తనింటికి వెళ్ళిపోతున్నట్లు చెప్పింది.

ఒక గంట వరకు బస్సు దొరకలేదు. తీరా బస్సు పట్టుకొని, ఇంటి కెళ్ళే సరికి మూడు దాటింది.

పడక గదిలో దృశ్యం చూసి, సరిత అచేతనంగా ఉండిపోయింది.

గదిలో పట్టె మంచం మీద కనకం, కనకంతో అప్పుడప్పుడు వీధి మలుపు వరకు వచ్చే అబ్బాయి బట్టల్లేకుండా, అసహ్యంగా ఒకరు నొకరు... పడక గదిలో కిటికీ అవతల నిల్చున్న బాబి ఊచలు పట్టుకొని, లోపల దృశ్యాన్ని కనురెప్పలు వేయకుండా చూస్తున్నాడు. ఎనిమిదేళ్ళ పసితనం ఏదో అవ్యక్తమైన భావంతో ఎర్ర బడింది.

సరిత ఉద్రేకం తో ఊగిపోయింది.

ఆమెకే తెలియనంత ఉద్వేగంతో పని పిల్లను కేకేసింది. ఆ శబ్ద తరంగాలు గదిలో ప్రతిధ్వనించాయి. బాబిగాడ్ని పిచ్చిగా చిదక బాదింది.

"ఎవరైనా వస్తే నన్ను కనకం చూడమంది అమ్మా!" ఆ మాటలు సరిత వినిపించుకోలేదు. ఆ పసివాడు సొమ్మసిల్లి కిందపడి పోయే వరకు ఆమె కొట్టింది. ఆ మొఖం తనకి చూపించకుండా పొమ్మని కనకాన్ని హెచ్చరించింది.

మంచం మీది దుప్పటీ పరుపూ పెరట్లో వేసి, మంట పెట్టింది.

ఇంటి విషయంలో, పిల్లల విషయంలో తనెంత అశ్రద్ధగా ఉందో ఆక్షణమే ఆమెకి తెలిసింది. రెండు పడవల మీద కాళ్లు పెట్టి ప్రయాణం చేయగల శక్తి నేర్పూ తనకి లేవు... ఒక ఇల్లాలుగా, మాతృమూర్తిగా తన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే చాలు. ఆ ఒక్క న్యాయంతో గెలిస్తే చాలు.

ఆ సమయంలో రమాకాంత్ చెప్పిన మాట గుర్తొచ్చింది.

"సరితా! ఇంటినీ పిల్లల్నీ చూసుకోవడమే నీలాంటి వాళ్ళకి ఓ పెద్ద ఉద్యోగం."

మర్నాడు సరిత తన ఉద్యోగానికి రాజీనామా యిచ్చిన కాగితం చూసి, రమాకాంత్ ఆశ్చర్యపోయాడు. కారణాలు గుచ్చి గుచ్చి అడిగినప్పటికీ అతనికి సమాధానం దొరకలేదు. బహుశా, వాళ్ళ దాంపత్యంలో అతనికి తెలియకుండా సరిత దాచిన నిజం అదొక్కటే కావొచ్చు.

## చిన్నారికి చిన్నమాట

### — బాలగంగాధర తిలక్



జీవితం సంగీతం పెట్టెపైద
చిగురుటాకు అంగుళులను కదలనీ
పలుకుతుంది హిందోళ
ఒలుకుతుంది నవహేల
అపుడు–
బ్రతుకే ఊగే ముత్యాల ఉయ్యాల.

జీవితం నవనీతం పాత్రతో ద
చెదరి పడనివ్వకు రాయి నీ రప్పనీ
పగులుతుంది స్వప్నం
రగులుతుంది దుఃఖం
అందుకే
బ్రతుకే ఉలిపిరి కాగితం చందం.

జీవితం దేవతల దరస్మితం
చిన్నారీ! పెదవి మీద సింగారించు
కలతవద్దు కొలతవద్దు
అలసట అలజడివద్దు బాల
అపుడు
బ్రతుకే లలిత లలిత లతాంతమాల!

(1964 మే జ్యోతి నుంచి)